ప్రజాశక్తి
ఆదివారం 1 జనవరి 2023
5
శ్రీకాకుళం



కొత్త ఆశలతో,
నూతన ఆశయాలతో,
వినూత్న ఆరంభాలతో,
సరికొత్త ఆలోచనలతో,
గతం మిగిల్చిన జ్ఞాపకాలతో,
సంతోషాలను పంచిన క్షణాలతో,
చేదు అనుభవాల పాఠాలతో,
మరో మజిలీని స్వాగతిస్తూ..
మీ కలలు సాకారం కావాలని ఆశిస్తూ
నూతన సంవత్సర శుభాకాంక్షలు





వచ్చే విద్యా సంవత్సరం నుంచే

సిబిఎస్ఇ

- 90 పాఠశాలల్లో తొమ్మిదో తరగతి నుంచి
- తొలి విడత ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

నూతన విద్యా సంవత్సరం నుంచే ప్రభుత్వ పాఠశాలల్లో సిబిఎస్ఈ (సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) అమలుకు పాఠశాల విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో 90 పాఠశాలల్లో అమలుకు సిద్ధమైంది. దీనిపై రెండు రోజుల పాటు ఉమ్మడి జిల్లాలోని ప్రధాన ఉపాధ్యాయులు, సహాయకులకు శిక్షణ ఇచ్చారు.

ఉమ్మడి జిల్లాలో 90 పాఠశాలలు గుర్తింపు పొందాయి. 2023-24లో తొమ్మిదో తరగతి నుంచి సిబిఎస్ఈ అమలు చేస్తారు. ఈ విద్యార్థులు 2024-25 విద్యాసంవత్సరంలో పదో తరగతి పరీక్షలు ఈ విధానంలో రాయనున్నారు. తొమ్మిదో తరగతికి ప్రవేశాలు నిర్వహించే విధానం, రిజిస్ట్రేషన్, విద్యార్థుల పరిశీలన, పరీక్షా విధానం, మూల్యాంకనం, తదితర అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. రెండు బ్యాచ్‌లుగా నిర్వహించిన తర్ఫీదులో జిల్లా నుంచి శిక్షణ పొందిన నలుగురు, విశాఖ నుంచి ఇంకో ఇద్దరు రీసోర్స్‌పర్సన్లు హాజరయ్యారు. తరగతుల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రతి ఏడాదీ గుర్తింపు విధానం పోర్టల్స్‌లో నవీకరణ ఎలా చేయాలి? పాఠశాలలు అకడమిక్ పొందే సహకారం, విద్యార్థులు చదవాల్సిన సబ్జెక్టులు, ఎన్ఈపిలో భాగంగా నైపుణ్యం, వృత్తి విద్యను నిర్వహించే పద్ధతులు, ఉపాధ్యాయులకు మాడ్యూల్స్ ఉపయోగించడంపై అవగాహన కల్పించారు.

పాఠ్య పుస్తకాల్లో మార్పులు

జాతీయ విద్య పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సిఈఆర్‌టి) పాఠ్య పుస్తకాలను సిబిఎస్ఈ అనుసరిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఈ సిలబస్ ఆధారంగా పుస్తకాలు అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఏడాది ఎనిమిదో తరగతికి ఇదే సిలబస్ ఆధారంగా రూపొందించిన పుస్తకాలే ఇచ్చారు. వచ్చే ఏడాదికి తొమ్మిదో తరగతికి కూడా ఈ విధానానికి అనుగుణంగా పుస్తకాలు తీసుకురానున్నారు. 1-7 తరగతులకూ ఇవ్వాలని ఇప్పటికే పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. గణితం, ఆంగ్లం, సామాన్య శాస్త్రం సబ్జెక్టులకు సంబంధించి కొత్తగా ఇస్తారు. సాంఘికశాస్త్రం రాష్ట్ర సిలబస్‌లో ఉంటుంది. అన్ని తరగతులకూ సిబిఎస్ఈ పుస్తకాలు ఇచ్చినా, బోర్డు అనుమతి లేని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర బోర్డు పరీక్షలే రాయనున్నారని అధికారులు పేర్కొంటున్నారు.

గ్లోబల్ పోటీని ఎదుర్కొనేలా..



సిబిఎస్ఈతో ప్రభుత్వ విద్యార్థి గ్లోబల్ పోటీని ఎదుర్కొనే విధంగా తర్ఫీదు పొందుతాడు. సిలబస్ అర్థం చేసుకోవడం, వర్తమానంలో వచ్చే మార్పులు అన్వయించుకుని చదువుకోవడం జరుగుతుంది. ఎక్కడైనా విద్యార్థులు రాణించ గలుగుతారు.

-గార పగడాలమ్మ, డిఇఒ



గోవిందరావుకు వినతిపత్రం అందజేస్తున్న టోల్‌ప్లాజా కార్మికులు

సమరశీల పోరాటాలకు సిద్ధం

- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు
- వినతిపత్రం అందజేసిన టోల్‌ప్లాజా కార్మికులు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని చిలకపాలెం టోల్ ప్లాజా కార్మికుల సమస్యను వెంటనే పరిష్కరించాలని, లేకపోతే సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. చిలకపాలెం టోల్‌ప్లాజాలో 15ఏళ్లుగా పనిచేస్తున్న 106 మంది కార్మికులకు మడపాం, నాతవలస టోల్ ప్లాజాల్లో వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని, గ్రాట్యూటీ, నష్టపరిహారం వెంటనే చెల్లించాలని, రోడ్డున పడ్డ కార్మికులను ఆదుకోవాలని కోరుతూ టోల్‌ప్లాజా ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యాన సిపిఎం జిల్లా కార్యాలయంలో గోవిందరావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిలకపాలెం టోల్‌ప్లాజాను ఎత్తివేసి ఇక్కడి ఆదాయం నాతవలస, మడపాం టోల్ ప్లాజాల్లో సర్దుబాటు చేసిన నేషనల్ హైవే అధికారులు 106 మంది కార్మికులను పట్టించుకోకుండా రోడ్డున పడేయడం అన్యాయమని అన్నారు. నేషనల్ హైవే అధికారులు కార్మికులందరినీ రెండు టోల్‌ప్లాజాల్లో సర్దుబాటు చేసి, విధుల్లో కొనసాగించాలని, గ్రాట్యూటీ, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

కార్మికులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అర్థాంతరంగా నిలిపివేయడంతో వారి కుటుంబాలు ఎలా బతకాలని, పిల్లల స్కూల్, కాలేజీ ఫీజులు ఎలా చెల్లించగలరని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యమంత్రి జగన్‌కు లేఖ రాశారని గుర్తుచేశారు. కార్మికుల పోరాటానికి సిపిఎం అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, చిలకపాలెం టోల్‌ప్లాజా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వి.వెంకటరమణ, డి.వి.నర్సింహులు, ఎవిఆర్.మూర్తి, శంకరనారాయణ, టి.అప్పారావు, కృష్ణారావు, బి.రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిని ఆదిలోనే గుర్తించాలి

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి- కవిటి, కంచిలి

కిడ్నీ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించాలని, మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, ఎటువంటి నలతగా ఉన్నా మెడికల్ షాపుల వద్దకు కాకుండా వైద్యుల వద్దకు వెళ్లాలని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా సూచించారు. కవిటి మండలం బొరివంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, కంచిలి మండలం తలతంపరలో వైద్య శిబిరాలు, న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ అనారోగ్యానికి గురైన వారు ప్రాథమిక దశలోనే కిడ్నీ సంబంధిత పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తిస్తే ప్రాణ నష్టాలను నివారించవచ్చని అన్నారు. ప్రభుత్వపరంగా ఏమైనా సహాయం కావాలంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. స్థానికంగా ఉంటున్న డాక్టర్ జగబంధు మీ అందరికీ సహకరిస్తారని తెలిపారు. పలు చట్టాలను వివరించారు. డిఎంఅండ్‌హెచ్‌ఒ బి.మీనాక్షి మాట్లాడుతూ కిడ్నీ వ్యాధి అనేది కేవలం ఈ ప్రాంతానికే పరిమితమైనది కాదని, ప్రపంచ వ్యాప్తంగా ఉందని అన్నారు. దీనిపై ఈ ప్రాంతంలో ఉన్న అపోహలు తొలగించి, వ్యాధి నిర్ధారణ పరీక్షలు కచ్చితంగా చేయించుకోవాలని కోరారు. ప్రారంభ దశలోనే కిడ్నీ వ్యాధిని గుర్తిస్తే పూర్తిస్థాయిలో వ్యాధిని నియంత్రించే అవకాశం ఉంటుందని అన్నారు. దీని కోసం ఉద్దానం ప్రాంతంలోని అన్ని ఆస్పత్రుల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారని, అంతేకాకుండా కిడ్నీ బాధితుల కోసం 36 రకాల మందులు ప్రభుత్వం అందుబాటులో ఉంచిందని తెలిపారు. నెఫ్రాలజిస్ట్ డాక్టర్ విద్యాసాగర్ మాట్లాడుతూ జిల్లా ఆస్పత్రిలో ఉన్న ఇద్దరు నెఫ్రాలజిస్టులు కిడ్నీ ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న ఆస్పత్రులను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. కిడ్నీ వ్యాధి నిర్మూలన కోసం ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నిస్తోందని అన్నారు. అయితే స్థానికులు లోపల ఉన్న భయాలు, అనుమానాలు తొలగించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కేవలం ముందస్తు చర్యలు, పరీక్షలు లేక పోవటంతోనే కిడ్నీ బాధితుల సంఖ్య పెరుగుతోందని, ప్రాథమిక దశ నుంచే అప్రమత్తంగా ఉంటే రాబోయే రోజుల్లో పూర్తిస్థాయిలో వ్యాధిని నియంత్రించే అవకాశం ఉంటుందని చెప్పారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

అనంతరం కిడ్నీ రోగుల కోసం వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు, పలాస జూనియర్ సివిల్ జడ్జి పి.రవిశంకర్, సోంపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ.రాము, లీగల్ సెల్ కార్యదర్శి సన్యాసినాయుడు, ఎంపిడిఒ పైలా సూర్యనారాయణ రెడ్డి, డిఎస్‌పి శివరామిరెడ్డి, కంచిలి తహశీల్దార్ హైమావతి, డిటి తమ్మినేని రామచంద్రరావు, సర్పంచ్ బెందాళం శ్రీరామ్ ప్రసాద్, సర్పంచ్ జగబంధు దోలాయి, బొరివంక ఆస్పత్రి వైద్యులు హరిత, సిఐ, వైద్య సిబ్బంది, ఆశలు పాల్గొన్నారు.



ప్రజాశక్తి డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

'ప్రజాశక్తి' డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రజాశక్తి దినపత్రిక 2023 డైరీ, క్యాలండర్‌ను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తన ఛాంబరులో శనివారం ఆవిష్కరించారు. ప్రజాశక్తి క్యాలండర్ ప్రత్యేకతను శ్రీకాకుళం ఎడిషన్ మేనేజర్ పి.కామినాయుడు వివరించారు. కార్యక్రమంలో ప్రజాశక్తి స్టాఫ్ రిపోర్టర్ టి.భీమారావు, ఎడివిటి జిల్లా ఇన్‌ఛార్జి టి.బుజ్జిబాబు, శ్రీకాకుళం డివిజన్ ఆర్గనైజర్ ఆర్.ప్రకాశరావు, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రముఖుల నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా ప్రజలకు స్పీకర్ తమ్మినేని సీతారాం, రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, మత్స్య, పశుసంవర్థకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2023 ప్రజలకు శుభాలు, సంతోషాలు, ఆనందాలు నింపే సంవత్సరం కావాలని ఆకాంక్షించారు.

జగన్ రాష్ట్ర ప్రజలకు సుభిక్షమైన పాలన అందిస్తున్నారని స్పీకర్ సీతారాం అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయరంగాలతో పాటు నవరత్నాల అమలుకు రాష్ట్ర ముఖ్యమంత్రి పెద్దపీట వేశారన్నారు. 2023లో మరిన్ని కార్యక్రమాలు దిగ్విజయంగా చేయాలని అభిలాషించారు. కరోనా భారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అన్ని వర్గాల ప్రజలకు నూతన సంవత్సరం సరికొత్త ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని, ఆనందాన్ని సమకూర్చాలని ఆకాక్షించారు.

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రం మరింత ప్రగతి పథంలో దూసుకెళ్లాలని మంత్రి ధర్మాన ప్రసాదరావు అభిలాషించారు. నవరత్నాలను పక్కాగా అమలు చేయడం ద్వారా నూతన సంవత్సరం రాక మునుపే రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు వచ్చాయని చెప్పారు. కరోనా నాలుగో దశ ప్రారంభం కానున్న తరుణంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలని ధర్మాన పిలుపునిచ్చారు.

నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలకు శుభాలు జరగాలని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ ఆకాంక్షించారు. ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ పేదల కళ్లల్లో ఆనందాన్ని, సంతోషాన్ని చూస్తున్నామన్నారు. ఆర్థికంగా, సామాజికంగా అభివద్ధి చెందాలని ఆమె ప్రజలకు సూచించారు.

జిల్లా ప్రజలకు 2023 నూతన సంవత్సరం భోగ భాగ్యాలను ఇవ్వాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేస్తూ నా ప్రియమైన ప్రజలందరికి... నూతన సంవత్సరం మంచి ఆరోగ్యాన్ని, క్షేమాన్ని అందించాలని కలెక్టర్ తెలిపారు. కరోనా నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో కొత్త సంవత్సరంలో ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపాలని శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆకాంక్షించారు. రైతులు, విద్యార్థులు, యువత, ఉద్యోగులు గత ఏడాది కంటే మెరుగైన జీవనం సాగించాలని కోరారు.

జిల్లాలో సుభిక్షంగా వర్షాలు కురిసి రైతాంగానికి పాడి, పంటలు సమృద్ధిగా ఉండి, లాభాలు పొందాలని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ఆకాంక్షించారు. అభివృద్ధివైపు అన్ని వర్గాల ప్రజలు అడుగులు వేయాలన్నారు.

ప్రజాశక్తి కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ ఎచ్చెర్ల మండలం నవభారత్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ప్రజాశక్తి శ్రీకాకుళం ఎడిషన్ కార్యాలయంలో శనివారం రాత్రి వేడుకలు నిర్వహించారు. ఎడిషన్ మేనేజర్ పి.కామినాయుడు కేకును కట్ చేసి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో వ్యక్తిగత అభివృద్ధితో పాటు, సంస్థ పురోగతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమన్వయ కమిటీ కన్వీనర్ ఎ.సోమశేఖరరావు, స్టాఫ్ రిపోర్టర్ టి.భీమారావు, ఎడివిటి ఇన్‌ఛార్జి టి.బుజ్జిబాబు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



కేకును కట్ చేస్తున్న ఎడిషన్ మేనేజర్ కామినాయుడు

పక్కాగా పిఎంజికెఎవై అమలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్నయోజన (పిఎంజికెఎవై) పథకం జిల్లాలో పక్కాగా అమలుకావాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్ పౌర సరఫరాల సిబ్బందిని ఆదేశించారు. శనివారం బలగలోని రేషన్ డిపోలో పిఎంజికెఎవై పంపిణీ అమలు తీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్డుదారులతో మాట్లాడారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్నయోజన పథకం కింద ఒక్కొక్కరికి ఐదు కేజీల బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్న సంగతిని గుర్తుచేశారు. వాలంటీర్ల వద్ద నుండి పిఎంజికెఎవై కూపన్లు లబ్ధిదారులు పొంది ఉచిత బియ్యాన్ని పొందాలని సూచించారు. సంపూర్ణ ఆహారంతో ఆరోగ్యకరమైన కుటుంబాన్ని అందించాలనేది ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. లబ్ధిదారులకు పంపిణీ విధానాన్ని స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. లబ్ధిదారులకు ఉచితంగా ఆహారం అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమంలో భాగస్వాములు కావడం ఆనందదాయకమన్నారు. డిపో డీలర్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశించిన ధరలకే పనిముట్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన రాయితీ ధరలకే వ్యవసాయ పనిముట్లను రైతులకు అందజేయాలని సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. జిల్లాలోని వ్యవసాయ పనిముట్ల తయారీదారులు, కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పంపిణీదారులతో జిల్లా ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశం శనివారం జెసి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ వ్యవసాయ పనిముట్లు తయారీదారులు రైతులకు అవసరమైన మేరకు అందుబాటులో ఉంచాలన్నారు. పనిముట్ల ధరలు అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలని, ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు విక్రయించడంతో పాటు ప్రభుత్వ రాయితీలు కూడా వర్తింపజేయాలని జెసి ఆదేశించారు. పనిముట్ల తయారీలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. జిల్లా ధరల పర్యవేక్షణ కమిటీ రైతుల పనిముట్ల ధరలను పరివేక్షిస్తుందని తెలిపారు. సమావేశంలో జిల్లా అధికారి కె.శ్రీధర్, జిల్లా ఉద్యానవన అధికారి ఆర్.వి.ప్రసాద్, రాగోలు పరిశోధనా సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి.ఉదయ్‌బాబు, జిల్లా ఆగ్రోస్ మేనేజర్ చంద్రశేఖర్, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు టి.భవానీశంకర్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పండగ వేళ పింఛన్ల కోత

ప్రజాశక్తి -శ్రీకాకుళం ప్రతినిధి

అవ్వ, తాతలకు పింఛను సొమ్మును జనవరి నెలలో రూ.2,250 నుంచి 2,750లు చేయబోతున్నామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించిన తర్వాత పండుటాకులు పొంగిపోయారు. పెంచిన రూ.250తో మందులు, ఇతర ఖర్చులు కొంతవరకు తీరుతాయని ఆశ పడ్డారు. తీరా పింఛను తీసేస్తున్నామని అధికారులు ఇస్తున్న నోటీసులు చూసి దు:ఖం ఆపుకోలేకపోతున్నారు. పింఛను సొమ్మును పెంచి పింఛను తీసుకుంటున్న వారి సంఖ్యను తగ్గించింది. వివిధ నిబంధనల పేరుతో లబ్ధిదారులను జల్లెడపట్టి పింఛన్లు తొలగించేందుకు గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది జిల్లా వ్యాప్తంగా 5,994 మందికి నోటీసులు ఇచ్చారు. పండగ నెలలో పింఛను కోత పెట్టడంతో పేదలు లబోదిబోమంటున్నారు. పింఛను సొమ్ము అందితే సంక్రాంతి ఖర్చులకైనా ఉపయోగపడుతుందనుకుంటే ప్రభుత్వం దానినీ తీసేసిందని ఉసూరుమంటున్నారు. తమ బంధువుల సాయంతో అధికార పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధుల ఇళ్లకు వెళ్లి తమకు పింఛను వచ్చేలా చూడాలంటూ ప్రాధేయపడుతున్నారు. సచివాలయాలు, ఎంపిడిఒ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. తామేమీ చేసేది లేదంటూ తిప్పి పంపడంతో ఉసూరుమంటూ ఇంటి ముఖం పడుతున్నారు. ఇప్పటివరకు పింఛన్లకు అర్హులైన వారు అకస్మికంగా ఎలా అనర్హులయ్యారో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వం విధించిన నిబంధనల్లో 300 యూనిట్లకు మించి కరెంట్ వాడకం, ఆదాయపన్ను, ఇంటిలో సభ్యుడు ఉద్యోగిగా ఉండటం, గ్రామాల్లో 750 చదరపు అడుగులు, పట్టణాల్లో వెయ్యి చదరపు అడుగులకు మించి స్థలం కలిగి ఉండటం, మూడు ఎకరాలకు మించి భూమి ఉందన్న పేరుతో తొలగింపు నోటీసులు ఇచ్చారు. తండ్రి, కొడుకులు వేర్వేరుగా నివాసముంటున్నా కరెంట్ బిల్లులను కలిపి 300 యూనిట్లు దాటిందంటూ కవిడి మండలంలో ఓ వృద్ధుడికి నోటీసు ఇవ్వడంతో నిర్ఘాంతపోయాడు. విశాఖపట్నంలో నివాసముంటున్న శ్రీకాకుళం మండలం సింగుపురానికి చెందిన మహేష్ కారు కొనడంతో ఇక్కడి ఆయన తండ్రి జోగయ్యకు పింఛను తీసేశారు. ఇలా చెప్పుకుంటూ వెళ్తే అనేక దృష్టాంతాలు ఉన్నాయి. ప్రజాసాధికార సర్వే పేరుతో ఎప్పటికప్పుడు వివరాలు సేకరిస్తున్న ప్రభుత్వం వాటినే ఆధారంగా చేసుకుని పింఛన్లను ఊడబీకుతోంది. కుటుంబ యజమానితో పాటు సభ్యుల ఆధార్ నంబర్ల డేటాను క్రోడీకరించి కుటుంబ సభ్యులెవరు ఏం కొనుగోలు చేసినా వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలపై వేటు వేసింది. వృద్ధాప్యంలో తల్లిదండ్రుల బాగోగులను పట్టించుకోకుండా ఎవరి దారి వారు చూసుకుంటున్న బాపతులే ఎక్కువగా ఉన్నారు. ప్రభుత్వం అవేవీ పరిశీలించకుండా వారికి సంబంధంలేని అంశాలతో నోటీసులు ఇచ్చి పింఛన్లు తొలగిస్తూ వారికి అన్యాయం చేస్తోంది. అటు కన్న కొడుకులు వదిలేసి, ఇంటికి పెద్ద కొడుకు అని చెప్పుకుంటున్న జగన్న కూడా పింఛను తీసేస్తే తమకు బువ్వ పెట్టేదెవరని అవ్వా, తాతలు అడుగుతున్నారు.



మరో వైపు పండగ నెలలోనూ పప్పు అన్నం తినే పరిస్థితి కనిపించడం లేదు. ఒకటో తేదీ వచ్చినా అంతంత మాత్రంగానే పంచదార, కందిపప్పు వచ్చాయి. ఈ పాటికే పౌర సరఫరాల గోడౌన్లకు సరుకులు చేరాల్సి ఉండగా ఇప్పటివరకు రాలేదు. డిసెంబర్ నెల ఆధారంగా ప్రభుత్వం కేటాయింపులు జరుపుతుందని అధికారులు చెప్తున్నారు. ఆ లెక్కల ప్రకారం చూసుకున్నా కొరతగానే ఉంది. జిల్లాలో 6,58,257 రేషన్ కార్డుదారులకు సరఫరా చేసేందుకు 652 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం కాగా ఇప్పటివరకు 283 టన్నుల మాత్రమే అందుబాటులో ఉంది. మరో 50 టన్నులు ఒకట్రెండు రోజుల్లో జిల్లాకు చేరనుంది. అయినా ఇంకా 319 టన్నులు కావాల్సి ఉండటంతో ఆ మేరకు తమకు కందిపప్పు పంపాలని జిల్లా అధికారులు పౌర సరఫరాల కమిషనర్‌కు లేఖ రాశారు. మిగిలిన కందిపప్పు జిల్లాకు చేరడంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మహారాష్ట్రలోని నాగపూర్‌కు చెందిన పలు సంస్థలు రాష్ట్రానికి కావాల్సిన కందిపప్పును సరఫరా చేస్తున్నాయి. కందిపప్పు సరఫరాకు టెండర్లను పిలవాల్సి ఉన్నా ఇప్పటివరకు ప్రభుత్వం ఆ పని చేయలేదు. ఇదంతా జరిగేసరికి పంపిణీ సమయం కాస్తా ముగిసిపోతుందనే చర్చ జరుగుతోంది. పంచదార నిల్వలూ అలానే ఉంది. జిల్లాకు 380 టన్నుల పంచదార అవసరం కాగా 202 టన్నుల మాత్రమే అందుబాటులో ఉంది. దీంతో పండగ నెలలో పంచదార, కందిపప్పు కొందరికే అందే పరిస్థితి కనిపిస్తోంది.

పింఛను అందితే గానీ రోజు గడవని పరిస్థితుల్లో వేలాది మంది ఉంటే అధికార పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలకు అవేవీ పట్టడం లేదు. తమ క్యాంపు ఆఫీసుల్లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. శాసనసభాపతి తమ్మినేని సీతారాం, మంత్రులు ధర్మాన, సీదిరి అప్పలరాజు అనుచరులు చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. కనీసం 30వేల మందితో న్యూ ఇయర్ వేడుకలను నిర్వహించాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అనుచరులు ఏర్పాట్లు చేశారు. అమాత్యులకు శుభాకాంక్షలు తెలిపేందుకు పలానా సమయాల్లో అందుబాటులో ఉంటారంటూ ఎమ్మెల్యేలు, మంత్రులు అధికారులు, కార్యకర్తలకు సోషల్ మీడియాలో సందేశాలను పంపారు. ధాన్యం కొనుగోళ్లు సరిగా జరగక రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఆర్‌బికెల్లో పరీక్షలు సరిగా చేయకపోవడంతో మిల్లరు ధాన్యం తీసుకునేందుకు ససేమిరా అంటున్నారు. ధాన్యానికి మిల్లర్లు ఇచ్చిన బ్యాంకు గ్యారంటీలు అయిపోవడంతో రైతులు సుదూర ప్రాంతాల్లోని మిల్లులకు ధాన్యం ఇవ్వాల్సి వస్తుండటంతో తీవ్ర వ్యయ, ప్రయాసలకులోనవుతున్నారు. జిల్లాలో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లపై ఒక్క మంత్రి కూడా అధికారులతో సమీక్ష చేసిన పాపాన పోలేదు. జనం సమస్యల మధ్య ఉంటే సంబరాలు చేసుకోవడం అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులకే చెల్లింది.

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

(6లో)

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశం వాడీవేడిగా సాగింది. సమావేశంలో అజెండాలోని అంశాలపై చర్చిస్తున్న సమయంలో టిడిపి కౌన్సిలర్ ఆసీ లీలారాణి మాట్లాడుతూ ఇచ్ఛాపురం పురపాలక సంఘంలో అభివృద్ధి పనులు చేపట్టాలంటే... వార్డు కౌన్సిలర్లు కాంట్రాక్టర్ అవతారం ఎత్తాలా? అని ప్రశ్నించారు. 17 నెలలుగా తన వార్డు పరిధిలోని కాలువ నిర్మాణాల చేపట్టాలని చాలాసార్లు కోరామని, అయినా మోక్షం లభించలేదని వాపోయారు. మున్సిపాలిటీలో కేవలం ఇద్దరు కాంట్రాక్టర్లు ఉండడంతో పనులు చేయడానికి ముందుకు రావడం లేదని, బిల్లులు పెండింగ్ ఉంటున్నాయని అన్నారు. దీంతో వైస్ చైర్మన్ లాభాల స్వర్ణమణి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇచ్చిన చెత్త జిఒతో ఇప్పుడు ఇబ్బందులు వస్తున్నాయని వివరించారు. రాజ్యలక్ష్మి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అభివృద్ధి పనులు వేగవంతమవుతున్నాయని అన్నారు. దీంతో ఒకసారిగా ఇరు గ్రూపుల మధ్య మాటల యుద్ధం జరిగింది. ఈ సమయంలో టిడిపి కౌన్సెలర్ పత్రీ తవిటయ్యు మాట్లాడుతూ తన వార్డులో ప్రోటోకాల్ పాటించడం లేదని, పింఛన్లు పంపిణీ కూడా తనకు తెలియకుండా చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. కో-ఆప్షన్ సభ్యులు సాలీనా ఢిల్లీ జోక్యం చేసుకుని పింఛన్లు పంపిణీలో సిఎం జగన్ చిత్రపటం పెట్టి ఒక పండుగ లా చేస్తే ఎటువంటి అభ్యంతరం లేదని అన్నారు. దీంతో ఇరువురు మధ్య మాటామాట పెరిగాయి. నువ్వు ఎవ్వరు అని, కో-ఆప్షన్ సభ్యులూ కేవలం సలహాలు, సూచనలూ ఇవ్వాలి తప్ప మధ్యలో జోక్యం చేసుకుని చర్చిలో పాల్గొవడం మంచి పద్ధతి కాదని అన్నారు. దీంతో ఇద్దరి మధ్యా తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. కౌన్సిల్ సమావేశం మందిరంలో ఇద్దరు పెద్దగా ఘర్షణ పడుతు వ్యక్తిగత ఆరోపణలు చేసుకున్నారు. తోటి సభ్యుల జోక్యంతో పరిస్థితి చక్కబడింది. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ కో-ఆప్షన్ సభ్యులను ప్రభుత్వం ఎంపిక చేసిందని, ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నప్పుడు జోక్యం చేసుకోవడం తప్పు కాదని అన్నారు. వార్డు కౌన్సిలర్ మధుమూర్తి మాట్లాడుతూ తన వార్డులోని ఉప్పల వీధి, కొండివీధిలో తొమ్మిది రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదని, ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే గ్రామ దేవత సంబరాల్లో ఇబ్బందులు వస్తాయని అన్నారు. మున్సిపల్


కౌన్సిలర్ల మధ్య వాగ్వివాదం

కమిషనర్ రమేష్ మాట్లాడుతూ తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. బెల్లుపడా, అచ్చంపేట ప్రభుత్వ భూమి కబ్జాకు పాల్పడడం ఎంతవరకు సబబని కౌన్సెల్ సభ్యులు బచ్చు జగన్ అధికారులను నిలదీశారు. కమిషనర్ సమాధానం ఇస్తు కోర్టులో ఉండడంతో ఎటువంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాలతో కబ్జా భూమిపై విచారణకు అదేశాలు జారీ చేశామని అన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ సుల్తాన్, పత్తి విజయకుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన

క్రీడా పోటీల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

వైసిపి నియోజకవర్గ నాయకుడు చింతాడ రవికుమార్ అధ్యక్షతన 'జగనన్న సంక్రాంతి సంబరాలు'లో భాగంగా ఈ నెల 11,12,13 తేదీల్లో ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్, జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు పురపాలక సంఘంలోని రావికండిపేటలో నిర్వహించనున్నారు. ఈ మేరకు పోటీలు నిర్వహించే సన్నాహాల్లో భాగంగా శ్రీకాకుళం రూరల్ మండలం రెవెన్యూమంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు శనివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతలోని గల క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడం, క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తుందని అన్నారు. అలాగే రవికుమార్ మాట్లాడుతూ ఈ పోటీల్లో ప్రతి విభాగానికీ మొదటి బహుమతికి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, 3,4 బహుమతులు రూ.20 వేలు నగదు, ట్రోఫీలు అందజేస్తామని తెలిపారు. జిల్లాలోని క్రీడాకారులందరూ పాల్గొనాలని కోరారు. సుశిక్షితులైన అంపైర్ల ఆధ్వర్యాన నిష్పక్షికంగా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. వీటితో పాటు మహిళలకు ముగ్గుల పోటీలు, విద్యార్థులకు జగనన్న నవరత్నాల పథకాలకు సంబంధించి విశ్లేషణాత్మక వ్యాస రచన పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి నాయకులు చిగురుపల్లి రవికుమార్, బత్తుల లక్ష్మణరావు, కెప్టెన్ సైది రామారావు, అన్నెపు కృష్ణ పాల్గొన్నారు.


అభినందిస్తున్న డైరెక్టర్ నాగేశ్వరరావు

షార్ట్‌పుట్‌లో 'ఐతమ్'కు స్వర్ణం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

జెఎన్‌టియు విజయనగరం యూనివర్సిటీ స్థాయిలో నిర్వహించిన షార్ట్‌పుట్ పోటీలో టెక్కలి ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో తృతీయ ఏడాది ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కోర్సు చదువుతున్న గార శ్రీకాంత్ 11 మీటర్ల దూరం విసిరి బంగారు పతకం గెలుచుకున్నాడని ఐతమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు సూరంపాలెంలోని ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. జనవరి 9 నుంచి 12 వరకు చెన్నయ్‌లో నిర్వహించనున్న జాతీయ క్రీడల్లో పాల్గొనేందుకు అర్హత పొందాడని వివరించారు. అలాగే 'ఖోఖో' విభాగంలో సిఎస్ఇ మొదటి ఏడాదికి చెందిన నౌపడ ఢిల్లేష్, ఇఇఇకి చెందిన దూబ ప్రేమసాయిలు సౌత్ జోన్ ఖోఖో తరుపున పాల్గొనేందుకు ఎంపికయ్యారని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ పి.మురళీధర్, డీన్లు ఎస్.లక్ష్మణమూర్తి, టి.మురళీమోహన్, జె.తేజశ్వరులు అభినందించారు.

రవికుమార్ పరామర్శ

బూర్జ : మండలంలోని ఇటీవల మృతి చెందిన కుటుంబాలను టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ శనివారం పరామర్శించారు. ముందుగా చీడివలసకు చెందిన మండల టిడిపి మండల ఉపాధ్యక్షుడు పిల్లా కన్నం నాయుడు (మల్లీశ్వరరావు) తల్లి ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. పాలకొండ పట్టణంలో కెజిబివి ఎస్ఒ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తోటవాడలో ఉంటున్న ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయనతో పాటు టిడిపి యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రామకృష్ణ, కార్యకర్తలు ఉన్నారు.

రక్షణ రంగంలో యువతే కీలకం

కవిటి: రక్షణ రంగంలో యువతే కీలకమని చేయాలని ఎమ్మెల్యే బెందాలం అశోక్ అన్నారు. కవిటిలోని తిరుపూర్ గార్మెంట్స్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మాజీ సైనికుడు, తురుపుర్ గార్మెంట్స్ అధినేత పాతిన ఉమాశంకర్ శనివారం పరుగు పోటీలు నిర్వహించారు. రక్షణ రంగానికి చెందిన పలు పోటీ పరీక్షల్లో పాల్గొంటున్న పలు జిల్లాలకు యువకులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజయనగరం జిల్లాకు చెందిన మళ్ల హరీష్ ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. జిల్లాలోని తిలారుకు చెందిన పల్లా సంతోష్, కొర్లాంకు చెందిన మహేష్ ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. అలాగే అనకాపల్లికి చెందిన ఎస్.సంతోష్, నెల్లూరుకు చెందిన కె.శివ 4,5 స్థానాల్లో నిలిచారు. అనంతరం ఎమ్మెల్యే, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలు, 3,4,5 స్థానాలకు రూ.వెయ్యి చొప్పున అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు, వైసిపి రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి పులకల శ్రీరాములు, మాజీ సర్పంచ్‌లు ఆరింగి మధు, పాండవ శేఖర్, అగ్నికుల క్షత్రియ సంఘం అధ్యక్షుడు పొల్లాయి లక్ష్మణమూర్తి, పాతిన వెంకటరావు, రంగారావు, నారాయణరావు, బల్లెడ రమేష్, బాలక శ్రీను పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్

జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


బూర్జ : ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

బూర్జ : జిల్లాస్థాయి పోటీల్లో మండలంలోని కె.కె.రాజ పురం పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటారు. శ్రీకాకుళం పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు నిర్వహించిన జిల్లాస్థాయి గ్రిగ్స్ బాలికల ఫైనల్ పోటీలో బాలికలు ఆల్ రౌండ్ ప్రతిభను చాటారు. అథ్లెటిక్స్‌లో పాఠశాలకు చెందిన ఎస్.మాధురి వంద, 200, 400 మీటర్ల విభాగా ల్లోనూ, అలాగే రన్నింగ్‌లో మూడు ప్రథమ స్థానాలను కైవసం చేసుకుంది. అలాగే డి.తేజేశ్వని డిస్కత్రో లో ప్రథమ స్థానం దక్కించుకుంది. హెచ్ఎం టి.పద్మావతి, పిఇటి అప్పన్న, ఉపాధ్యాయ శనివారం అభినందించారు.

కెజిబివి విద్యార్థినులు...

పొందూరు: శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి గ్రిగ్స్ పోటీల్లో మండలంలోని లోలుగు కెజిబివి విద్యార్థినులు తమ సత్తాను చాటారు. సీనియర్ బాలికల వాలీబాల్ పోటీలలో పాఠశాల రన్నర్‌గా నిలిచింది. అలాగే షాట్‌పుట్, డిస్కస్ త్రోలో కె.సంజన తృతీయ స్థానంలో నిలిచింది. ఈ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థినులకు ఎస్ఒ రేజేటి సౌమ్య, పిఇటి మొకర రూపవతి పాల్గొన్నారు.

'ఎంజిఆర్' ఆర్థికసాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

నెల్లూరు జిల్లా కందుకూరు బహిరంగ సభలో మృతి చెందిన ఎనిమిది మంది టిడిపి పార్టీ కుటుంబ సభ్యులకు సామాజిక వేత్త, టిడిపి నాయకులు మామిడి గోవిందరావు శనివారం ఆర్థికసాయం అందజేశారు. ఒక్కో కుటుంబానికి రూ.50 వేలు చొప్పున టిడిపి రాష్ట్ర అధ్యక్షులు చేతుల మీదుగా తనవంతు సహాయాన్ని అందించినట్లు తెలిపారు. ఈ మేరకు మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే ఎల్ఎన్‌పేటలోని కింజరాపు ఎర్రన్నాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

పూర్వ విద్యార్థులు...

ఆమదాలవలస : మండలంలోని దూసిపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1997 బ్యాచ్‌కు చెందిన బెలమాంకు చెందిన శివాలయం పంతులు కుమార్తె జోగులకోటి పార్వతి కేన్సర్ వ్యాధితో బాధపడుతుంది. ఆమెతో చదువుకున్న పూర్వ విద్యార్థులు విషయం తెలుసుకుని శనివారం ఇంటికి వెళ్లి రూ.35 వేలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమ బ్యాచ్ విద్యార్థులకు ఎవరికి ఎటువంటి ఆపద వచ్చిన అందరం ఏకమై సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చిగురుపల్లి అమ్మాజి, తమ్మినేని జనార్ధనమ్మ, వాకముళ్ల గోపాలకృష్ణ, కోటేశ్వరరావు, పూజారి ఆనందరావు, గడిదేసి రామారావు, మొదలవలస తులసీరావు, కర్రి ఢిల్లేశ్వరరావు, కోట గిరిబాబు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న గోవిందరావు


విరిగిన రైల్వే ట్రాక్

ఇంటర్‌సిటీకి తప్పిన ప్రమాదం

సిగ్నల్ టెలీకమిషన్ రిషికేష్ చౌదరికి అభినందనలు

ప్రజాశక్తి- సోంపేట

ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌కు శుక్రవారం పెను ప్రమాదం తప్పింది. బారువ, మందస రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్ విరిగిపోయింది. ట్రాక్ విరిగిపోయిన సమాచారాన్ని సిగ్నల్ టెలీకమిషన్ రిషికేష్‌చౌదరి గుర్తించి బారువ రైల్వేస్టేషన్ మాస్టార్ హరగోపాల్‌కు క్షణాల్లో సమాచారం అందజేశారు. స్టేషన్ మాస్టర్ బారువ రైల్వేస్టేషన్ ముందుకు ఎర్ర జెండాను పట్టుకుని వెళ్లి ఊపారు. దీంతో డ్రైవర్ అప్రమత్తమై ట్రైన్‌ను బారువలో నిలుపుదల చేశారు. అనంతరం ట్రాక్ పనులు పునరుద్ధరించి రైలును మళ్లించారు. దీంతో రిసికేష్ చౌదరి, హరగోపాల్‌లకు ప్రయాణికులు, ఉన్నతాధికారులు అభినందించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పొందూరు



పొందూరు-సంతకవిటి రహదారిలోని లైదాం రైల్వేగేటు సమీపంలోని తుంగపేట వద్ద శనివారం రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జిఆర్‌పి పోలీసులు తెలిపారు. మృతునికి సుమారు 50 ఏళ్లు ఉండవచ్చేనని, బ్లాక్ టీషర్టు, నీలం రంగు లుంగీని ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. ఇతని ఆచూకీ తెలిసిన వారు ఈ కింది 7013273731 సెల్ నంబరుకు సమాచారం అందించాలని కోరారు.


కార్మికులతో చర్చిస్తున్న అధికారులు

సమ్మె విరమణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలిలో తాగునీరు అందించే సమగ్ర రక్షిత నీటి పథకంలో పనిచేస్తున్న సిపిడబ్ల్యుఎస్, ఆర్‌డబ్ల్యుఎస్ కార్మికులకు తొమ్మిది నెలలుగా జీతాలు చెల్లించలేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవడంతో ఆదివారం నుంచి సమ్మె చేసేందుకు కార్మికులు సిద్ధమయ్యారు. అధికారులకు నోటీసులు కూడా అందజేశారు. రెండు రోజుల నుంచి ఎఇ, డిఇ, ఎస్ఇలను కలిసి మాట్లాడారు. ఈ మేరకు అధికారులు స్పందించారు. శనివారం రక్షిత తాగునీటి పథకం జిల్లా సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇలు మోహన్, మధులు కాంట్రాక్టర్ తేజేశ్వరరావుతో చర్చించారు. ఈ చర్చిలో కార్మికులకు మూడు నెలల జీతాలు చెల్లించేందుకు, రూ.3 వేలు పెంచేందుకు అంగీకరించారు. బకాయిలు లేకుండా చూడాలని, ప్రతినెలా సకాలంలో జీతాలు చెల్లించాలని యూనియన్ నాయకులు కాంట్రాక్టర్‌కు సూచించారు. దీంతో కార్మికులు సమ్మెను విరమించారు. కార్యక్రమంలో కార్మికులు ధర్మారావు, సురేష్, రత్నాకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


ఎంపికైన విద్యార్థులు

క్యాంపస్ ఇంటర్వ్యూలో 24 మంది ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన 'మోల్డ్ టెక్ టెక్నాలజీస్ లిమిటెడ్' కంపెనీ శనివారం క్యాంప్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఇందులో బిటెక్ కోర్సు పూర్తిచేయనున్న 24 మంది విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. వార్షిక వేతనంగా రూ.2.4 లక్షలు చెల్లించేందుకు మోల్టెక్ అంగీకరించిందని పేర్కొన్నారు. వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుంటూ, ఉన్నత పదవుల్లో స్థిరపడాలని అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ ఫిన్సింగ్ స్కూల్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ ఎం.ఎన్.వి.ఎస్.ఎస్.కుమార్, అధ్యాపకులు అభినందించారు.

తైక్వాండో పోటీలో విద్యార్థుల ప్రతిభ

టెక్కలి: టెక్కలి క్రీడా వికాస్ కేంద్రానికి చెందిన తైక్వాండో విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారని కోచ్ నర్సిపురం శేఖర్ శనివారం తెలిపారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో ఈ నెల 28 నుంచి 30 వరకు 66వ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించారు. శ్రీరామలింగేశ్వర పంక్షన్ హాల్‌లో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన నిర్వహించే అండర్-14 విభాగంలో తాస్వి కృష్ణస్వామి బంగారు పతకం సాధించారని పేర్కొన్నారు. అండర్-17 బాలికల విభాగంలో పులిబంద జాశ్విక (46 కిలోలు), నంబాళ సంజన (64 కిలోలు) విభాగంలో బంగారు పతకాలు సాధించారని తెలిపారు. బాలురు విభాగంలో సీపాన ఆబిషేక్ (35 కిలోలు), నౌపడా గణేష్ (63 కిలోలు) విభాగంలో పాల్గొని బంగారు పతకాలు సాధించారని చెప్పారు. జనవరిలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని అన్నారు. అండర్-19వ విభాగంలో బొడ్డ గేయామృత (55 కిలోలు) విభాగంలో కాంస్య పతకం సాధించిందన్నారు. విజేతలను జిల్లా క్రీడాశాఖాధికారి మాధవీలత, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, మండల క్రీడా ఆధికారి బాడాన నారాయణరావు, వ్యాయామ ఉపాధ్యాయులు కుప్పిలి ప్రకాష్, పాండవుల జగదీష్, లక్ష్మణరాజా, కె.కె.రామిరెడ్డి, కాపల రఘునాథరావులు అభినందించారు.


పతకాలతో క్రీడాకారులు

ధర్మారావు మృతి పార్టీకి తీరనిలోటు


అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని హరిశ్చంద్రపురానికి చెందిన వైసిపి నాయకుడు చింతాడ ధర్మారావు మృతి పార్టీకి తీరని లోటు అని ఎమ్మెల్సీ, టెక్కలి నియోజకవర్గ అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. ధర్మారావు అనారోగ్యంతో శనివారం మృతి చెందడంతో ఆయన అంతిమయాత్రలో దువ్వాడ పాల్గొని నివాళ్లర్పించారు. ధర్మారావు కుటుంబానికి పార్టీ అన్ని వేళల అండగా ఉంటుందన్నారు. అలాగే కోటబొమ్మాళి సర్పంచ్ కాళ్ల సంజీవరావు, హరిశ్చంద్రపురం సర్పంచ్ గురువెళ్లి కేశవరావు ధర్మారావు అంతిక్రియలో పాల్గొని నివాళ్లర్పిం చారు. రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, వైసిపి నాయకులు గడ్డవలస నాగభూషణరావు, నూక సత్యరాజు, వైఎస్ ఎంపిపి దుక్క రామకృష్ణ, అన్నెపు రామారావు, ఎంపిపికళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, పేడాడ వెంకటరావు ధర్మారావు మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

మార్పు అనేది మన ఆలోచనల్లో ఉందని, మన దృష్టిని మార్చుకుని చూస్తే ప్రపంచంలో మనం చూడాలనుకున్న మార్పును చూడవచ్చని నెహ్రూ యువ కేంద్ర కో-ఆర్డినేటర్ ఉజ్వల్ వెంకట్ అన్నారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాల లో అట్టహాసంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విషయాన్నీ కొత్తగా చూడటం నేర్చుకోవాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కొత్త ఆలోచనలను ఆచరించే వారే భవిష్యత్‌లో అగ్రస్థానంలో నిలుస్తారన్నారు. ఎస్ఐ సింహాచలం మాట్లాడుతూ క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్, ప్రిన్సిపాల్ రమణమూర్తి, ఇఎం నాయుడు, మెండ మోహన్ దాస్, ముకళ్ల శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉజ్వల వెంకట్

తాగునీరు అందించడంలో విఫలం

అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, మున్సిపాలిటీ ప్రజలకు తాగునీరు అందించడంలో పాలకవర్గం పూర్తిగా విఫలమైందని, ఎక్కడ చూసినా పారిశుధ్యం అధ్వానంగా ఉందని కౌన్సిలర్లు వజ్జ బాబూరావు, గురిటి సూర్యనారాయణ మున్సిపల్ అధికారులను నిలదీశారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన శనివారం సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ శీతాకాలంలోనే తాగునీరు ఇవ్వలేని స్థితిలో ఉన్నామని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఐదు రోజులకు ఒకసారి నీరు ఇస్తే ఏలాంటూ అధికారులను ప్రశ్నించారు. లైటింగ్ సమస్య తీవ్రంగా ఉందని కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లారు. 23వ వార్డును అభివృద్ధి చేయడం లేదని, మురుగు కాలువలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రోడ్లు కూడా నిర్మాణం చేపట్టడం లేదని, తాను సహకరించడం వల్లే అభివృద్ధి పనులు చేయగలుగుతున్నారని అన్నారు. ఈ విషయం అధికారులు తెలుసుకోవాలన్నారు. కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో చాలా పింఛన్లు రద్దు చేయడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ విప్ దుర్గా శంకర్ పండా మాట్లాడుతూ పింఛన్లు రద్దు చేయలేదని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో అధికారులు పరిశీలిస్తున్నారని చెప్పారు. కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ మాట్లాడుతూ మున్సిపాలిటీకి ఆదాయం పెరిగిందని, ఈ మేరకు సాధారణ నిధుల నుంచి పారిశుధ్య కార్మికులను నియమించాలని సూచించారు. పేదవాడు ఇళ్ల కట్టుకుంటామంటే విద్యుత్ అధికారులు మీటర్లు ఏర్పాటు చేయడం లేదని, దీనిపై విద్యుత్ అధికారులు స్పందించి పేదవానికి న్యాయం చేయాలని కౌన్సిలర్ శ్రీకాంత్, కో-ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్‌లు విజ్ఞప్తి చేశారు. దీనిపై విద్యుత్ ఎడిఇ ఐ.హరికృష్ణ సమాధానం ఇస్తూ నిబంధన మేరకు మీటర్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బోర కృష్ణారావు మాట్లాడుతూ తన వార్డు పరిధిలోని సచివాలయా న్ని మార్చేందుకు అంచనాలు రూపొందించమని కోరానని అన్నారు. కోరా రెండు నెలలు అయినా అధికారులు ఎందుకు అంచనాలు రూపొందిం చడం లేదని ప్రశ్నించారు. కౌన్సిలర్ బెల్లాల శ్రీను మాట్లాడుతూ మున్సిపాలిటీ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా మాజీ ప్రధానమంత్రి వాజ్‌పేయి విగ్రహాన్ని ఏలా ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. దుర్గా శంకర్ పండా మాట్లాడుతూ జగనన్న కాలనీలో బోర్లు పాడవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం చైర్మన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, మున్సిపల్ కమి షనర్ టి.రాజగోపాల్, డిఇఇ బల్ల హరి, టౌనింగ్ ప్లానింగ్ అధికారి హెచ్.వి.సత్యనారాయణ పాల్గొన్నారు.


అధికారులను ప్రశ్నిస్తున్న బాబూరావు, (ఇన్‌సెట్‌)లో మాట్లాడుతున్న గిరిబాబు

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



కవిటి : ట్యాబ్‌లు అందజేస్తున్న సర్పంచ్ భద్రాచలం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని వైసిపి విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు పాలిన ఉమామహేశ్వరరావు కోరారు. మండలంలోని గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్ లను తల్లిదండ్రుల కమిటీ సభ్యులు ఉపాధ్యాయులతో కలిసి శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల టి.రంగరాజు పిఎంసి చైర్మన్ పాలిన పాపారావు, పాలిన శోభన్‌బాబు, సర్పంచ్ బత్తిని ప్రసాదరావు, పూడి జగన్నాథపురం ఎంపిటిసి ప్రతినిధి కారి వెంకటరావు, ప్రధానోపాధ్యాయులు కె.ఢిల్లీరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని దుగానపుట్టుగ ఎంపియుపి, బి.జి.పుట్టుగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆయా పంచాయతీల సర్పంచ్‌లు దుగాన భద్రాచలం, బద్రి ప్రకాష్ బైజుస్ ట్యాబులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ ధనుంజయ మజ్జి, దుగానపుట్టుగ ఉప సర్పంచ్ మోహన్, విద్యా కమిటీ చైర్మన్ లక్ష్మి, బిజి పుట్టుగ పాఠశాల హెచ్ఎం ఖగేశ్వరరావు, గ్రామ పెద్దలు బొడ్డ కృష్ణమూర్తి, బాలక లక్ష్మీనారాయణ, బి.వెంకటేష్, బి.జగదీష్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని కురుడు జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సర్పంచ్ కె.చిన్నారావు అధ్యక్షతన ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు ట్యాబ్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి పంకు లక్ష్మి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, ఎంఇఒ సిహెచ్. గోవిందరావు పాల్గొన్నారు. అలాగే కోటబొమ్మాళి బాలికల జిల్లా పరిషత్ పాఠశాలలో సర్పంచ్ కాళ్ల సంజీవరావు కూడా ట్యాబ్‌ను అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆర్.యోగేశ్వరరావు, వైసిపి నాయకులు ఇర్రి చిరంజీవి, పండా గోవింద్, డబ్బీరు ప్రదీప్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌లు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి అన్నారు. మున్సిపల్ ప్రభుత్వ హైస్కూల్‌లో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థులకు హెచ్ఎం బి.త్రినాథరావు అధ్యక్షతన ఆమె ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. జగనన్న విద్యా కానుక, గోరుముద్ద, అమ్మఒడి వంటి ఎన్నో పథకాలను తీసుకొచ్చారని అన్నారు. సమావేశంలో కౌన్సిలర్ పిలక ఈశ్వరి, కౌన్సిలర్ ప్రతినిధి పిలక విజయభాస్కర్, కంబాల వెంకటరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని లోలుగు కెజిబివిలో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు ట్యాబ్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఒ రేజేటి సౌమ్య, వైసిపి మండల అధ్యక్షులు పప్పల రమేష్‌కుమార్, ఎంపిటిసి లక్ష్మంనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులుకొంచాడ రమణమూర్తి, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు గుడ్ల మోహనరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని గుజరాతిపేటలోని ఎవిఎన్ఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు 41వ డివిజన్


సంతబొమ్మాళి : ట్యాబ్‌లను అందజేస్తున్న నాయకులు


నౌపడ : ట్యాబ్‌లతో విద్యార్థులు


పొందూరు : ట్యాబ్‌లను అందజేస్తున్న నాయకులు

వైసిపి నాయకులు అంధవరపు ప్రసాద్, సంతోష్‌లు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఇందిరామణి, వైసిపి నాయకులు టి.కామేశ్వరి, మళ్లా శ్రీనివాస్ చక్రవర్తి, కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని మరువాడ పంచాయతీ ఎం.మరువాడ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి, ఎంపిటిసి సూరాడ రాజారావు, సచివాలయ కన్వీనర్ గంట ఈశ్వరరావులు ట్యాబ్‌లను అందజేశారు. కార్యక్రమంలో సూరాడ దాసురాజు, ప్రధానోపాధ్యాయులు కుమార్, సూరాడ జోగారావు, బొంగుపిల్లి సునీత పాల్గొన్నారు.

నౌపడ : నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ట్యాబ్‌లను హెచ్ఎం దాశరధి, నౌపడ సర్పంచ్ ప్రతినిధి పిలక రవికుమార్‌రెడ్డి, ఎంపిటిసి ప్రతినిధి లోపింటి రాములు, విద్యా కమిటీ చైర్మన్ పిట్ట కోటి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపాలకృష్ణ, మల్లేశ్వరరావు, నాయుడు, అప్పలరాజు, వెంకటరావు, రమేష్, మోహనరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కళావెంకటరావు

వైసిపిని ఇంటికి సాగనంపాలి

మాజీ మంత్రి కళావెంకటరావు

ప్రజాశక్తి- లావేరు

ఒక్కఛాన్స్ అంటూ ప్రజలును మోసగించిన మోసకారి ప్రభుత్వాన్ని సాగనంపాలని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావు అన్నారు. లావేరులోని టిడిపి ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన బాదుడే బాదుడులో పాల్గొని మాట్లాడారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ వైఫల్యాలపై నినాదాలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వచ్చిన తర్వాత ఇటువంటి అరాచక ప్రభుత్వాన్ని చూడలేదన్నారు. మద్యపాన నిషేదం అని ఎన్నికల్లో చెప్పి అధికారంలోకి వచ్చి భారీగా ధరలు పెంచేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మాజీ ఎంపిపి మీసాల వెంకటరమణ, పి.మధుబాబు, ఆర్.ప్రకాశరావు, ఇజ్జు వెంకటేస్వరరావు, లంకలపల్లి జగన్నదొర, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విజేతలకు అభినందనలు

వజ్రపుకొత్తూరు: రాష్ట్రస్థాయి క్రీడల్లో విద్యార్థులు తమ సత్తా చాటాలని గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తలగాన లింగరాజు అన్నారు. ఇటీవల జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైన పాఠశాల విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్ నడిమింటి నాగరాజును శనివారం సహచర ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ క్రమశిక్షణ విద్యతో పాటు ఆటలూ ముఖ్యమన్నారు. విద్యార్థులు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉన్నప్పుడే అభ్యాసన సామర్థ్యం మెరుగ్గా ఉంటుందన్నారు. 2022-23 విద్యా సంవత్సరంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెలక్షన్స్ ట్రైల్స్‌లో తమ పాఠశాల నుంచి విద్యార్థులు జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ తెలిపారు. చింత హరిత ట్రిపుల్ జంప్, తామాడ లిఖిత హేమర్‌త్రో, దట్టి రేష్మ డిస్కస్ త్రో, బోరుభద్ర పల్లవి బతకల జస్వంత్ రోప్ స్కిప్పింగ్‌లో భీమవరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని గిన్ని లింగ ప్రధాన్ నెల్లూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బమ్మిడి నరేంద్రకుమార్, చింత ఉమారావు పాల్గొన్నారు.

శ్రీశ్రీ కళా వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా 'ఈ వేమన'


ఈవేమన

రణస్థలం: శ్రీశ్రీ కళా వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కవి, రచయిత మహమ్మద్ రఫీ (ఈవేమన)ను నియమించారు. రఫీ స్థానిక ఆదర్శ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచమే శ్రీశ్రీ కళా వేదిక వైపు చూసేలా కవుల ప్రతిభకు పట్టం కట్టి అంతర్జాతీయ స్థాయిలో ఐఎస్‌ఒ సాధించారన్నారు. విదేశాల్లో కమిటీలు ఏర్పరచే సాహిత్య నిత్య కృషీవలుడు, అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ జిల్లా శ్రీశ్రీ కళా వేదిక అధ్యక్షుడుగా ఉన్న తనను చేస్తున్న సాహితీ సేవను గుర్తిస్తూ నూతన సంవత్సర కానుకగా ఎపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిమించారని పేర్కొన్నారు. వీరితోపాటు జాతీయ కన్వీనర్ రమావతి, జాతీయ మహిళా అధ్యక్షులు సి.లలిత, రాష్ట్ర అధ్యక్షుడు హరిసర్వోత్తమ రావులను నియమించారని తెలిపారు. ఈ వేమనకు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పి.శ్రీధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, హర్షం వ్యక్తం చేశారు.

మబగాంలో నూతన సంవత్సర వేడుకలు

పోలాకి : మండలంలోని మబగాంలో ఉన్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ నివాసంలో ఆదివారం ఉదయం 8 గంటలకు నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తున్నామని జెడ్‌పిటిసి, వైసిపి నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. కార్యకర్తలెవరూ బొకేలు, శాలువలు, పూలదండలు, స్వీట్లు తీసుకురావద్దని కోరారు. కరోనా నిబంధనలను పాటిస్తూ నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. పది వేల మందికి విందు భోజన ఏర్పాట్లని చేస్తున్నామని అన్నారు.

వాలంటీర్ల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

మెళియాపుట్టి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వాలంటీర్ల పోస్టుల భర్తీకి ఎంపిడిఒ పి.చంద్రకుమారి శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని చాపర, మెళియాపుట్టి, పెద్దలక్ష్మీపురం, బాణాపురం, జాడుపల్లి, గొప్పిలి, పెద్దపద్మాపురం, శేఖరాపురం గ్రామాలకు సంబంధించి గ్రామ వాలంటీర్ల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇఒ తిరుపతి పట్నాయక్ పాల్గొన్నారు.

పట్టుశాలి సంక్షేమ సంఘం ఎన్నిక ఏకగ్రీవం

పొందూరు: స్థానిక పట్టుశాలి సంక్షేమ సంఘం ఎన్నిక శనివారం ఏకగ్రీవమైంది. సంఘం అధ్యక్షుడిగా మలిపెద్ది శ్రీరంగనాయకులు, ఉపాధ్యక్షుడు బస్వా మన్మథరావు, కార్యదర్శిగా పాలిశెట్టి సూర్యప్రకాశరావు, కోశాధికారిగా వడగా సూర్యారావు, కార్యవర్గ సభ్యులుగా బస్వా రమణ, బస్వా అనంత లింగరాజు, బస్వా శ్రీనివాసరావు, కోరుకొండ సాయికుమార్, వడగా మనోరమ, అట్ల శేషగిరిరావులు ఎన్నికయ్యారు. ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు శాశ్వత సభ్యులుగా బాసా ఆనందమోహన్, పట్టుశాలి పెద్దలు డాక్టర్ డివిఎస్ ప్రకాశరావు, పమ్మిన కూర్మారావు, అట్ల కైలాసరావు, కోరుకొండ జయలక్ష్మి, గుంటుకు సత్యారావు, మణిభూషణరావు అభినందించారు.

సమన్వయంతో పనిచేయాలి

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు సమయస్ఫూర్తిగా వ్యవహరించి ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరించాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పిలుపునిచ్చారు. పట్టణంలోని ఓ ప్రయివేటు కళ్యాణ మండపంలో నియోజకవర్గ పరిశీలకులు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అధ్యక్షలన కన్వీనర్లు, వాలంటీర్లు, మున్సిపాలిటీ నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల ప్రగతిని ఇంటింటికీ చేరేందుకు కృషి చేయాలన్నారు. ఒకటి నుంచి వాలంటీర్లతోపాటు సచివాలయ కన్వీనర్లూ పింఛన్ల పంపిణీలో పాల్గొవాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, వైసిపి నాయకులు


ఆమదాలవలస : మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

బొడ్డేపల్లి రమేష్‌కుమార్, అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, దుంపల శ్యామ్, సనపల రాజు, శిల్లా మల్లిఖార్జునరావు, బొడ్డేపల్లి అజంతాకుమారి, యండ విశ్వనాథం, సాధు చిరంజీవి పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సచివాలయ కన్వీనర్లతో, వాలంటీర్లతో ఎమ్మెల్యే రెడ్డి శాంతి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కె.భాగ్యవతి, సర్పంచ్‌లు పి.కృష్ణవేణి, కుంచాల రత్నాలు, వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, ఎఎంసి చైర్‌పర్సన్ గోగుల మాధవి, పిఎసిఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, ఎంపిటిసి జి.రత్నకుమారి, సర్పంచ్ ప్రతినిధులు కలమట రమేష్‌బాబు, ఎం.చక్రపాణి, జి.వరప్రసాదరావునాయుడు, ఎల్.తిరుపతిరావు, జి.ఆనందరావు పాల్గొన్నారు.

బూర్జ : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బూర్జ సచివాలయంలో ప్రత్యేక పరిశీలకులు ఇందుకూరి రఘురాజుతో కలిసి కన్వీనర్లతో, వాలంటీర్లతో ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, ఎంపిపి కర్నేన దీప, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, అవుట్ సోర్సింగ్ రాష్ట్ర డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, పిఎసిఎస్ అధ్యక్షులు బగాది నారాయణమూర్తి, డిసిఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు, సర్పంచ్ ఎగూ అనురాధ పాల్గొన్నారు.

కమ్మేసిన పొగమంచు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పేదల ఊటీగా పేరుందిన శ్రీకాకుళం శనివారం పొగమంచు అందాలతో ఆహ్లాదకరమైన సుందర దృశ్యాలను ఆవిష్కృతం చేసింది. తలుపులు మూసుకునే అంత దట్టంగా ఈ మంచు ఆవహించింది. పక్క మనిషిని గుర్తు పట్టలేనంతగా మంచు దుప్పటితో ముసిగేసింది. పొగమంచు తప్పించుకునేందుకు సూర్య కిరణాలు భూమికి తాకడానికి ఉదయం 9 గంటల వరకు వెసులు బాటు లేకపోయింది. ఏజెన్సీ ప్రాంతం మాదిరిగా శ్రీకాకుళంలోనూ ఈ మంచు కురుస్తూనే ఉంది. తెల్లారింది మొదలు జీవనం సాగించడానికి ప్రయాసల పడే వారంతా ఈ మంచు పొరలను తప్పించుకుని వెళ్లడానికి చాలా ఇబ్బంది పడాల్సివచ్చింది. నాలుగు లైన్ల జాతీయ రహదారిపై



దట్టంగా కురుస్తున్న పొగమంచు

వేగంతో పరుగెత్తే వాహనాలు పొగ మంచు వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎదురుగా రోడ్డు తప్ప ఇంకేమి కనిపించకపోవడంతో ఎక్కడ ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందో అన్న భయం వారిని వెంటాడింది. తెల్లారినప్పటికీ లైట్ల వెలుతురులోనే నెమ్మదిగా వాహనాలు కదిలాయి. మరికొన్ని వాహనాలను ఈ మంచుకి ప్రమాదాల భయంతో రోడ్డు పక్కన నిలిపేశారు. ప్రకృతి అందాలు ఈ మంచుకి అద్భుతంగా కనిపించాయి.



క్యాలండర్లను ఆవిష్కరిస్తున్న డిఇఒ పగడాలమ్మ

క్యాలండర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎపిటిఎఫ్-2023 వార్షిక డైరీలను, క్యాలెండర్లను డిఇఒ జి.పగడాలమ్మ తన కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి, జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్మోహన్, జిల్లా కార్యదర్శులు చావలి శ్రీనివాస్, దాసరి రామ్మోహనరావు, రాక్మి కౌన్సిలర్ సదాశివుని శంకరరావు, రౌతు గణపతిరావు నాయుడు పాల్గొన్నారు.

ఆరోగ్యం భాస్కరాధిత్యం పేరుతో 25 వేల కాపీల పుస్తకాలు, వేయి పేపర్ వెయిట్లు అందజేసిన కిరణ్ ఆటోమొబైల్స్ సంస్థ ఈ ఏడాది అరసవల్లి సూర్యనారాయణ స్వామి క్యాలండర్లను అందజేశారని ఇఒ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. ఈ మేరకు దేవస్థాన కార్యాలయంలో క్యాలండరల్నఉ ఆవిష్కరించారు. రథసప్తమి వేడుకల్లో దాతలు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో కిరణ్ ఆటో మొబైల్స్ అధినేత బి.వి.రవిశంకర్, శాసపు జోగినాయుడు పాల్గొన్నారు.

సోంపేట : పట్టణంలోని మానవ హక్కుల వేదిక కౌన్సిల్ సభ్యులు బి.సురేష్ హెచ్‌ఆర్ క్యాలండర్‌ను ఆవిష్కరించారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ కార్యాలయాలకు క్యాలండర్ అందజేస్తూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

జగనన్న కాలనీల పరిశీలన

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల కు సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.ఫణీంద్రకుమార్ అన్నారు. మండలంలోని చీపుర్లపాడు, కన్నేవలస పంచాయతీల్లో శనివారం జగనన్న కాలనీలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారులు వేగంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. జగనన్న కాలనీలో అన్ని వసతులు కల్పిస్తామన్నారు. ఇప్పటికే రోడ్డు, విద్యుత్, తాగునీటి కోసం ప్రతిపాదనలు సిద్ధం


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ ఫణీంద్రకుమార్

చేశామని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ రెడ్డి పాపినాయుడు, విద్యుత్‌శాఖ ఎఇ సురేష్, పిఆర్‌ఎఇ లతశ్రీ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ కావ్య, ఎంపిటిసి డొడ్డు అప్పన్న, సర్పంచ్ ప్రతినిధి నేతింటి అప్పలస్వామి పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న మేనేజర్ శామ్యూల్

ఆర్‌టిసి దుకాణాల తనిఖీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో అద్దె ప్రాతిపదికన నిర్వహిస్తున్న వ్యాపార సముదాయాల్లో అధిక ధరలకు వస్తువులు విక్రయిస్తున్నట్టు ఫిర్యాదులు అందాయి. దీంతో డిపో మేనేజర్ శామ్యూల్ ఆధ్వర్యాన శనివారం తనిఖీలు చేపట్టారు. పది దుకాణాల్లో చేపట్టిన తనికీల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. వ్యాపారులకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి వంతున అపరాధ రుసుం వసూలు చేశారు. ఈ తనికీలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎఎం పాల్గొన్నారు.

ఎర్రముక్కాంలో గడప గడపకు...

సోంపేట: మండలంలోని ఎర్రముక్కాంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే సాయిరాజు ఆధ్వర్యాన శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ లోకేశ్వర్‌రెడ్డి, ఎంపిపిలు ఎన్.దాసు, పైల దేవదాస్‌రెడ్డి, మడ్డు


పోస్టర్‌ను అందజేస్తున్న విజయ

రాజారావు, బైపల్లి ఈశ్వరి, బట్టి మాధవరావు, ఆర్.విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని పిల్లలవలసలో పైడి స్వామి నాయుడు ఇంటి నుంచి కూన ధర్మారావు ఇంటివరకూ సిసి రోడ్డును నిర్మిస్తామని సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు శనివారం తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.1.50లక్షలతో ఈ రహదారిను నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఈ రహదారి నిర్మాణ పనులను పిఆర్ ఎఇ ఎస్.సత్యనారాయణ, వర్క్ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావులు పరిశీలించారు.


మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

అర్హులకు పింఛన్లు ఆగవు

ఎపిఎం కూర్మారావు

ఆమదాలవలస : అర్హత కలిగిన ఏ ఒక్కరికీ పింఛన్లు ఆగవని వైఎస్‌ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. మండలంలోని దూసి గ్రామ సంఘం సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు ఒకసారి సంక్షేమ పథకాలపై సమీక్షలో అనర్హులు ఎవ్వరూ ఉండకూడదన్న ఉద్దేశంతో వెరిఫికేషన్ చేస్తున్నామని అన్నారు. గ్రామాల్లో ఈ నెల 3న 9 వరకు పింఛన్ల పెంపు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సంఘం ప్రతినిధులు విఒఎలు సువర్ణ సునీత, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు చంద్రరావు, రమణ పాల్గొన్నారు.

రేపు ఉత్తర ప్రవేశం

శ్రీకాకుళం అర్బన్ : వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకున అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో సోమవారం ఉత్తర ద్వారా ప్రవేశం కల్పిస్తున్నట్టు ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. వేకువ జామున మేలు కొలుపు సేవ అనంతరం 5.30 గంటలకు తిరువీధి మహోత్సవం ఉంటుందని అన్నారు. అనంతరం ఉత్తర ద్వార ప్రవేశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ ద్వారం గుండా సందర్శకులకు ఆలయ ప్రవేశం కల్పించనున్నట్టు తెలిపారు. అనంతరం పుష్యమాసం శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో స్వామి కళ్యాణం నిర్వహిస్తామని తెలిపారు.

నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సందర్శన

నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్దవటం యానాదయ్య శనివారం అరసవల్లిని సందర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ఆయనతో పాటు కార్పొరేషన్ డైరెక్టర్లు వి.నూకరాజు, ఎం.సూర్యనారాయణ ఉన్నారు. వారికి ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్ జ్ఞాపికలను అందజేశారు.

స్టీమ్ ల్యాబ్ ప్రారంభం

ఇచ్ఛాపురం : స్టీమ్ ల్యాబ్ వల్ల విద్యార్థులకు అనేక రకాల ప్రయోజనాలు కలుగుతాయని వైసిపి సమన్వయకర్త సాయిరాజ్ అన్నారు. ఎపి మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్టీమ్ ల్యాబ్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ల్యాబ్ వల్ల విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన పెరుగుతుందన్నారు. ప్రిన్సిపాల్ జి.శివప్రసాద్ మాట్లాడుతూ 8,9,10 తరగతి విద్యార్థులకు స్టీమ్ ల్యాబ్ ఎంతోగనో ఉపయోగపడుతుందన్నారు. ఇందులో 80 రకాల ల్యాబ్‌లు పొందుపరిచామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, వైస్ చైర్మన్ లాభాల స్వర్ణమణి. ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ పాల్గొన్నారు.


చేనేత మగ్గాలను పరిశీలిస్తున్న సర్పంచ్ వాణిశ్రీ

చేనేతరంగం అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- ఆమదాలవలస

దేశ వారసత్వ సంపద వైభవానికి చేనేత వస్త్ర పరిశ్రమ అగ్రతాంబూలంగా నిలుస్తుందని ఇందుమతి ఛారిటబుల్ ట్రస్టు అధినేత, తొగరాం గ్రామ సర్పంచ్ తమ్మినేని వాణిశ్రీ అన్నారు. మండలంలోని అక్కులపేటలో శనివారం పర్యటించి చేనేత కుటుంబాలతో ముచ్చటించారు. వృత్తిపరంగా ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ డైరెక్టర్ నూక సన్యాసిరావు, వైసిపి నాయకుడు గురుగుబెల్లి ప్రభాకరరావు పాల్గొన్నారు.


బహుమతులను అందుకున్న విద్యార్థులు

బహుమతుల ప్రదానం

కొత్తూరు : మండలంలోని కర్లెమ్మ ఎంపిపి స్కూల్‌లో ఎద్దు అమరేష్ నాయుడు 34 వర్ధంతి సందర్భంగా కొత్తూరు, పారాపురం, మహసింగి, బిసి కాలనీలో చదువుతున్న విద్యార్థులకు ఇటీవల వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు ఎద్దు గోపాల్‌దాస్‌నాయుడు శనివారం బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పి.రామరాజు, ప్రిన్సిపల్ బి.రవికుమార్, ఎస్.భానోజీరావు, ఎల్.వి.రమణ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

బూర్జ : విద్యార్థులకు అందజేస్తున్న ఆహారంలో నిర్వాహకులు తప్పనిసరిగా మెనూను పాటించాలని ఎంపిపి కర్నెన దీప సూచించారు. స్థానిక జెడ్‌పిహెచ్‌ఎస్ స్కూల్‌లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం తనిఖీ చేశారు. ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందజేస్తుందని, దానిని నిర్వాహకులు సక్రమంగా అందజేయాలని అన్నారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. ఈమె వెంట సర్పంచ్ ఏగు అనురాధ, వావాం సర్పంచ్ మంజుల ఉన్నారు.


భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపిపి దీప


పరిశీలిస్తున్న ఎంపిడిఒ హరిహరరావు

భవన నిర్మాణ పనులు వేగవంతం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని లైదాంలో చేపడుతున్న ప్రాధాన్య త భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపిడిఒ సీపాన హరిహరరావు ఆదేశించారు. హౌసింగ్ డే సందర్భంగా గ్రామంలో చేపడుతున్న ఆర్‌బికె, వెల్‌నెస్ కేంద్రాల నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. అనంతరం స్థానిక సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈయనతో పాటు పలువురు అధికారులు ఉన్నారు.

హారికకు 'నాట్యరత్న'

శ్రీకాకుళం అర్బన్ : ఇటీవల తిరుమల తిరుపతిలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల బిబిఎ విద్యార్థిని అద్భుతమైన నృత్య ప్రదర్శనతో ప్రతిభను చాటారు. తిరుమల తిరుపతి ఆర్‌కె కళా సాంస్కృతిక ఫౌండేషన్ నిర్వహించిన శాస్త్రీయ నృత్య కార్యక్రమంలో శ్రీశైలం హారిక తమ నృత్య ప్రతిభను చాటి నటరాజ నాట్యరత్న-2022 పురస్కారాన్ని అందుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.వి.వేణుగోపాల్, ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, సెక్రెటరీ సుగుణరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ బి.ఇ.వి.ఎల్.నాయుడు, డైరెక్టర్ బి.శ్రీనివాస చక్రవర్తిలు హారికను అభినందించారు.


ప్రశంసాపత్రం అందజేస్తున్న చక్రవర్తి